సాక్షి ఏలూరు

సోమవారం । 18 । సెప్టెంబర్ । 2023



ప్రకృతి సోయగాల కొల్లేరు

కొల్లేరు ప్రకృతి సోయగాలతో అలరారుతోంది. కొల్లేరు పర్యాటకాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది.

8లో



పోడు పేరుతో నరికివేత

మర్లగూడెం తూర్పు వైపు అటవీప్రాంతంలో పోడు వ్యవసాయం పేరుతో వృక్షాలను యథేచ్ఛగా నరికివేశారు.

8లో



భీమవరంలో హత్య

భీమవరంలో పట్టపగలు యువకుడి హత్య సంచలనం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టి హతమార్చారు.

8లో

న్యూస్‌రీల్

సచివాలయాలతో సుపరిపాలన



అప్పనవీడులో సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

పెదపాడు : గ్రామాల్లో సుపరిపాలన అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. అప్పనవీడులో నిర్మాణం పూర్తయిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, పాల సేకరణ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎన్నడూలేని విధంగా సీఎం జగన్ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు గ్రామ సచివాలయాలు, రైతుల కోసం రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య సేవలు అందించేందుకు వెల్‌నెస్ సెంటర్‌లు దోహదపడుతున్నాయన్నారు. పాడి రైతులు దళారుల చేతిలో దగా పడకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కేంద్రాల్లో పాలు విక్రయించాలని సూచించారు. అప్పనవీడులో ఒకేచోట అన్ని భవనాలు నిర్మించడం శుభపరిణామమన్నారు. పెదపాడు మండల కన్వీనర్, ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గా ప్రసాద్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, సాధం కిశోర్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలు మేలు



కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ



కొఠారు అబ్బయ్య చౌదరి, ఎమ్మెల్యే

దెందులూరు: విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యం, సుఖ సంతోషాలతో జీవించాలని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆకాంక్షించారు. ఆదివారం వారు విడుదల చేసిన ప్రకటనల్లో ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా ప్రభుత్వ నిబంధనలకు ఆటంకం కలగకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను వినియోగించాలని కోరారు. వినాయక ఊరేగింపులు, నిమజ్జనాల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

మతసామరస్యం చాటిన ముస్లింలు



ఎమ్మెల్యే బాలరాజుకు మట్టి వినాయక ప్రతిమను అందిస్తున్న ముస్లింలు

కొయ్యలగూడెం: ప్రతి వేడుకలోనూ సర్వమత సామరస్యాన్ని చాటుతూ దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఆదివారం కొయ్యలగూడెం వచ్చిన ఆయనకు ముస్లిం యూత్ ఆధ్వర్యంలో మట్టి గణనాథుని ప్రతిమను అందజేశారు. యువజన నాయకుడు పఠాన్ రియాజ్‌ఖాన్ ఆధ్వర్యంలో వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపి వేడుకల నిర్వహణకు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలకు ఎమ్మెల్యే బాలరాజు కృతజ్ఞతలు తెలిపి యూత్ సభ్యులను అభినందించారు. కో–ఆప్షన్ సభ్యుడు ఎస్కే బాజీ, ఎస్కే షరీఫ్, మొయిద్దీన్, రంజాన్, ఎస్కే జహంగీర్, ఖలీల్, జానీ, బాబ్జి పాల్గొన్నారు.

వినాయక చవితి శుభాకాంక్షలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు(మెట్రో): జిల్లా ప్రజలకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలను వినియోగించుకోవాలని కోరారు.



ద్వారకాతిరుమల : గుడి సెంటర్‌లో పత్రి విక్రయాలు



చింతలపూడి : అమ్మకానికి సిద్ధంగా గణపతి ప్రతిమలు

చవితి సందడి.. ఆధ్యాత్మిక ఒరవడి



పెదవేగి : ముస్తాబైన గణపతి పందిరి

ఆదిదేవుడి పూజకు అంతటా ముస్తాబైంది. వినాయక చవితి వేడుకలకు భక్తులు సర్వం సిద్ధం చేశారు. ఆలయాలు, పందిళ్లు, ఇళ్లలో సోమవారం చవితి పూజలు ఘనంగా జరుగనున్నాయి. ఈ మేరకు ఆదివారం జిల్లా అంతటా చవితి సందడి కనిపించింది. వినాయక ప్రతిమలు, పత్రి, పూలు, పండ్లు, పూజా సామగ్రి అమ్మకాలు ఉత్సాహంగా సాగాయి.

–సాక్షి నెట్‌వర్క్



ద్వారకాతిరుమల : తిమ్మాపురంలో భారీ గణేశుడు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : పత్తేబాద సెంటర్‌లో..



ద్వారకాతిరుమల: శివలింగాకారంలో 50 కిలోల లడ్డూ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : విగ్రహాన్ని తరలిస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

- మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే
- పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని వెల్లడి

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాయనీ, రాష్ట్రంలో రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరులోని 14వ డివిజన్ కార్పొరేటర్ దారపు అనూష, దారపు తేజ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 100 మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం వారంతా వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అధికారం చేపట్టిన నాటి నుంచి కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా, వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు అమలు చేసి పేదవర్గాలకు అండగా నిలిచారన్నారు. రాష్ట్రంలో వైద్య, విద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు సీఎం జగన్ శ్రీకారం చుట్టారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్టు టీడీపీ, జనసేన నాయకులు చెప్పారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: రాష్ట్రవ్యాప్తంగా విశ్వ బ్రాహ్మణులకు విశ్వకర్మ జయంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నామనీ, విశ్వ బ్రాహ్మణులు రాజకీయంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అన్నివర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అండగా ఉంటున్నారన్నారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లక్కోజు గోపి మాట్లాడుతూ సీఎం జగన్ విశ్వ బ్రాహ్మణులకు మరింత గుర్తింపునిస్తూ విశ్వకర్మ జయంతిని రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీచేయడం హర్షణీయమన్నారు. ఈ మేరకు సీఎం జగన్, ఎమ్మెల్యే ఆళ్ల నానికి బీసీ సంఘాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, నగర కో–ఆప్షన్ సభ్యుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెదబాబు, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి, వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కిలాడి దుర్గారావు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, ఎన్.సుధీర్‌బాబు, గూడూరు హేమదుర్గాప్రసాదరావు, పార్టీ ఏలూరు క్లస్టర్–3 అధ్యక్షుడు మంచెం మైబాబు, కార్పొరేటర్లు ఉమామహేశ్వరరావు, ధనుంజయ్, విశ్వబ్రాహ్మణ నాయకులు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

భారతీయ విద్యాభవన్స్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



అంతర్జాతీయ అవార్డు అందుకుంటున్న శ్రీరంగనాథరాజు

పెనుగొండ : భారతీయ విద్యాభవన్స్ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్ భీమవరం అత్యంత ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ గ్రీన్ స్కూల్– 2023 అవార్డు సాధించింది. ఈ అవార్డును న్యూయార్క్‌లో జరిగిన సదస్సులో స్కూల్ చైర్మన్, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అందుకున్నారు. అంతర్జాతీయంగా ఉన్న పాఠశాలల్లో పర్యావరణం, నిర్వహణ, పచ్చదనాన్ని ప్రోత్సహించడంపై నిబద్ధత, క్యాంపస్ శుభ్రత, పాఠ్యాంశాల్లో ఉత్తమ అభ్యాసాలకు ఏటా యూఎస్‌లోని గ్రీన్ మౌంటర్స్, న్యూయార్క్ గ్రీన్‌స్కూల్ కాన్ఫరెన్స్ పురస్కారాలు అందిస్తోంది. ఈ కోవలో భీమవరం భారతీయ విద్యాభవన్స్ అవార్డును గెలుచుకుంది. న్యూయార్క్‌లోని కోర్నల్ యూనివర్సిటీలోని 570 లెక్సింగ్‌టన్ ఎవెన్యూలో జరిగిన 78వ సెషన్స్‌లో గ్రీన్ మెంటర్స్ ఫౌండర్ వీరేంద్ర రావత్, సంస్థ సభ్యుల చేతులమీదుగా అవార్డును మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు శనివారం అందుకున్నారు.

రాష్ట్రంలో అర్హులందరికీ పింఛన్లు

ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు



గణపవరంలో దివ్యాంగుడికి పింఛన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: దేశంలో అర్హతే ప్రామాణికంగా పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని, ఈ విషయాన్ని ప్రతిపక్షాలు మినహా యావత్ రాజకీయ పార్టీలు గుర్తించాయని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో నూతనంగా పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు నగదు అందజేశారు. గణపవరం మండలానికి చెందిన 467 మందికి, నిడమర్రు మండలానికి చెందిన 417 మందికి కొత్తగా సామాజిక పింఛన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ పింఛన్ మొత్తాన్ని పెంచుతూ వస్తున్నారన్నారు. జగన్ పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. దీంతో మన రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలను ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితరులు పింఛన్ సొమ్ముతో గౌరవంగా బతికేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. ప్రతినెలా ఒకటో తారీఖున వేకువజామునే ఇంటికే వలంటీర్ వచ్చి పింఛన్ సొమ్ములు అందించే ఏర్పాట్లు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిగా జగన్ అధికారం చేపడతారని, ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ దేవారపు సోమలక్ష్మి, మండల కన్వీనర్‌లు దండు రాము, సంకు సత్యకుమార్, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి నడింపల్లి సోమరాజు, మండల సర్పంచ్‌ల చాంబర్ చైర్మన్ చనుమూరి లక్ష్మీదుర్గ, మండల ఉపాధ్యక్షుడు సమయం వీరరాఘవులు, జిల్లా వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ వెజ్జువెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పొత్తు ఊహించిందే..

గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



కొయ్యలగూడెం : తెలుగుదేశం పార్టీ, జనసేన పొత్తులో కొత్తదనమేమీలేదని, ఇది వైఎస్సార్‌సీపీ ముందుగా ఊహించిందేనని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. ఆదివారం కొయ్యలగూడెంలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్యాకేజీ స్టార్ కన్ను ముఖ్యమంత్రి పదవిపై పడిందనీ, చంద్రబాబు అరెస్టును తనకు అనుకూలంగా మలుచుకోవడానికి దత్తపుత్రుడు పన్నాగాలు పన్నుతున్నాడని విమర్శించారు. లోకేష్‌ని పప్పు సుద్ద చేసి తెలుగుదేశం పార్టీ నుంచి సానుభూతి పొందాలని చూస్తున్నాడన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుపై పలు ఆరోపణలు గుప్పించిన పవన్‌కల్యాణ్ ఇప్పుడు ప్లేటు ఫిరాయించి కోట్లాది రూపాయల ప్యాకేజీతో జనశ్రేణులను పక్కదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. జనసైనికులు, టీడీపీ కార్యకర్తల్లో అంతర్మథనం మొదలైందని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను ఊసరవెల్లులుగా భావిస్తున్నారన్నారు. వీరి కంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెయ్యి రెట్లు బెటర్‌గా భావిస్తున్నారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలతో టీడీపీ, జనసేన పార్టీలు భూస్థాపితం కానున్నాయని అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిక్కాల దుర్గాప్రసాద్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అన్సర్ బాషా, గోపాలపురం మండల ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, విశాఖ స్మార్ట్ సిటీ చైర్మన్ జీవీ, ఎస్కే రియాజ్, ఘంటసాల సాయికుమార్ పాల్గొన్నారు.

కన్సీలియేషన్ అధికారుల నియామకం

ఏలూరు (టూటౌన్): వృద్ధుల పరిరక్షణ, సంక్షేమం కోసం 2007 చట్టం ప్రకారం ఏలూరు జిల్లాలోని మూడు డివిజన్‌లకు కన్సీలియేషన్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు జారీ చేయడంపై వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మర్రాపు శివరామకృష్ణారావు, బండారు సత్యనారాయణలు ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఏలూరు డివిజన్‌కు ఎంబీ శంకరరావు (సెల్94419 58286), జంగారెడ్డిగూడెం డివిజన్‌కు బోడ సత్యనారాయణ (సెల్ 94406 69777), నూజివీడు డివిజన్‌కు వై.రాధాకృష్ణ (సెల్ 95026 25609)ను కన్సీలియేషన్ అధికారులుగా నియమించారని పేర్కొన్నారు. జిల్లాలో వృద్ధుల సంక్షేమం కోసం ప్రత్యేక అధికారులను నియమించిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ ప్రభాకర్‌కు జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలియజేశారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకలు ప్రారంభం



ఖురాన్ పఠనం చేస్తున్న ఇమామ్‌లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక వన్‌టౌన్‌లోని హజరత్ మౌలా అలి ముష్కిల్ కుషా ఆస్థాన (గొలుసుల పంజా)లో అహెలే సున్నతుల్ జమాత్ ఆధ్వర్యంలో ఆదివారం జష్నే ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉదయం ఇమామ్‌లు దివ్య ఖురాన్ పారాయణం చేశారు. గొలుసుల పంజా వంశపారంపర్య ముజావరు ఎండీ గాలబ్ అలి మాట్లాడుతూ ఈనెల 28 వరకు జష్నే ఈదే మీలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం ఏడు గంటల నుంచి పేష్ ఇమాములచే ఖురాన్ పారాయణం, దరూద్ సలాం, ఫాతెహా ఖాని జరుగుతుందన్నారు. పది రోజుల వరకు ఉదయం, సాయంత్రం 6.30 గంటల నుంచి మహమ్మద్ ప్రవక్త చరిత్ర సీరత్ నబి గ్రంథ పఠనం చేస్తారన్నారు. భక్తులంతా పాల్గొని ప్రవక్త జీవిత చరిత్ర తెలుసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. సవి చౌక్ మసీద్ ఇమామ్ నాజిమ్ రజా మాట్లాడుతూ ప్రపంచంలో భారత్‌దేశం అగ్రగామిగా నిలవాలని దేశంలోని ప్రజలందరికీ మౌలిక వసతులు సమకూరాలని, సర్వమానవాళీ సుఖసంతోషాలతో, శాంతితో జీవించాలని ప్రార్థనలు చేశామన్నారు. ముజావర్లు ఎండీ వజీర్ అలీ, ఎండీ మున్వర్ అలీ, ఎస్కే జహంగీర్ పాషా, జమాత్ సభ్యులు షేక్ బాబు, ఎండీ ఇక్బాల్, ఎస్కే ఖైరుల్లాహ్ షరీఫ్, అబుభాయ్, సయ్యద్ సుల్తాన్, ఇస్లాంపేట్ మజీద్ ప్రెసిడెంట్ సయ్యద్ హాజీ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిత్రకళా పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: అంతర్జాతీయ చిత్రకళా పోటీల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి బంగారు పతకాలు సాధించారని హెచ్‌ఎం కె.పద్మావతి అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపులో భాగంగా హైదరాబాద్ యంగ్ ఎన్వాయిస్ ఇంటర్నేషనల్ నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు జాతీయ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, స్వాతంత్ర్య సమర ఘట్టాలు చిత్రించగా 15 మంది విద్యార్థులు బంగారు పతకాలు, 30 మంది జ్యూరీ హానర్ బహుమతులు సాధించినట్లు చెప్పారు.

కారు ఢీకొని యువకుడి మృతి

తణుకు: రూరల్ పరిధిలోని పైడిపర్రులో ఆదివారం రోడ్డు ప్రమాదంలో గణపవరం మండలం వాకపల్లికి చెందిన మొగిలినీడి శ్రీరామ్ (22) మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీరామ్‌తో పాటు బద్దా రాజు, తానేటి కమలకుమార్‌లు బైక్‌పై తణుకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో బస్టాండు సమీపంలో కారు ఢీకొట్టింది. శ్రీరామ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రాజు, కమలకుమార్‌లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

TADEPALLIGUDEM MUNICIPALITY
E- PROCUREMENT TENDER NOTICE
Roc No.2422/E1/2023-24 Dated: 18-09-2023

S.No	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs.)	Bid Downloading Start Date	Last Date for Receipt of Bids
1	Civil,Water supply & Electrical Works - 14Nos	General Founds	71.42	20.09.2023	26.09.2023

Full details can be had from the Municipal Engineering Department during working hours or visit Web site https://tender. apeprocurement.gov.in
Commissioner
Tadepalligudem Municipality



ప్రకృతి సోయగాల కొల్లేరు



కొల్లేటి సరస్సులో తుళ్లేటి చేపల వయ్యారాలకు ప్రకృతి సోయగాలు తోడవుతున్నాయి. దక్షిణ కశ్మీర్‌గా పేరుగడించిన కొల్లేరు పర్యాటకాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తోంది. చిత్తడి నేలల పరిరక్షణలో భాగంగా కొల్లేరు అంబాసిడర్‌గా వలస పక్షి గూడబాతు (స్పాట్ బిల్డ్ గ్రే పెలికాన్)ను ఇప్పటికే గుర్తించారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆపరేషన్ కొల్లేరు జరిగింది. పర్యావరణానికి విఘాతం కలిగించే ఆక్రమణ చెరువులు ధ్వంసం చేయడంతో కొల్లేరులో తిరిగి ప్రకృతి పరిఢవిల్లింది. దీంతో విదేశీ వలస పక్షులు సంఖ్య నానాటికి కొల్లేరులో పెరుగుతోంది.

- ఎకో టూరిజం కింద రూ.187 కోట్లతో అభివృద్ధికి ప్రణాళిక
- ఇటీవల కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన రాష్ట్ర ప్రభుత్వం
- బోటు షికారు, పక్షుల వీక్షణకు 20 ప్రదేశాల గుర్తింపు
- జీవవైవిధ్య యాజమాన్య కమిటీల ఏర్పాటుకు కసరత్తు



చిత్తడి నేలల కొల్లేరు ప్రాంతం

కైకలూరు: జిల్లాల పునర్విభజన తర్వాత కొల్లేరు ప్రాంతమంతా ఏలూరు జిల్లా పరిధిలోకి చేరింది. కొల్లేరు ఎకో టూరిజానికి రూ.187 కోట్ల ప్రణాళికతో ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది. కొల్లేరు పరీవాహక ప్రాంతాల్లో 20 ప్రదేశాలను గుర్తించి బోటు షికారు, సంప్రదాయ గేలాలతో చేపలు పట్టుకోవడం, పక్షుల వీక్షణ వంటివి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే 10 ప్రదేశాలను పర్యాటక శాఖ గుర్తించింది. ఏలూరు జిల్లాలో ఆటపాక పక్షులు కేంద్రం, ఏలూరు సమీపంలో మాధవాపురం పక్షుల విహార కేంద్రాలు ప్రసిద్ధి గాంచాయి. ఆటపాక పక్షుల కేంద్రంలో పెలికాన్ పక్షులు ఎక్కువ సంఖ్యలో రావడంతో కేంద్రానికి పెలికాన్ ప్యారడైజ్‌గా నామకరణం చేశారు.

జీవవైవిధ్యానికి పెద్దపీట

భూమిపై వృక్షాలు, జంతువులు సూక్ష్మజీవులు, ఔషధాలు వంటి జీవవైవిధ్య అంశాలు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం. ఇక్కడ వివిధ జాతుల పక్షులు, చేపలు, చెట్లు, కీటకాలు, సర్పాలు నివసిస్తున్నాయి. కొల్లేరు సరస్సులో అరుదైన నల్లజాతి చేపలు ఉన్నాయి. గ్రామస్థాయిలో జీవవైవిధ్య యాజమాన్య కమిటీలు (బీఎంసీ)ల ఏర్పాటుపై అటవీశాఖ అధికారులు ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నారు. గ్రామాల పరిధిలో ప్రత్యేకత కలిగిన ఔషధ మొక్కలు, పూర్వీకులు సాగు చేసిన వరి వంగడాలు వంటి వాటిపై ఆ ప్రాంత వాసులు పేటెంట్ సంక్రమింపజేసే అధికారాలు ఈ కమిటీ ద్వారా పొందవచ్చు. ఇప్పటికే పర్యావరణ అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేశామని అటవీ అధికారులు చెప్పారు.

కొల్లేరులో పెరిగిన పక్షుల సంఖ్య

కొల్లేరు పరివాహక ప్రాంతాల్లో ప్రకృతి అనుకూలంగా ఉండటంతో పక్షుల సంఖ్య పెరిగింది. ఈ ఏడాది కొల్లేరులో జరిగిన పక్షుల గణనలో 105 రకాల పక్షి జాతులను, 81,495 పక్షులు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో మొదటి స్థానంలో కోయిలలు (7,875) రెండో స్థానంలో పెలికాన్ పక్షులు(6,869) ఉండగా, అరుదైన పిన్‌టయిల్ స్నిప్ (సూది తోక పుర్రెది) పక్షి ఒకటి, సిట్రిన్ వాగ్‌యల్(పసుపు తల జిట్టంగి) పక్షులు నాలుగు కనిపించాయి. పక్షుల విహార కేంద్రాల్లో వలస పక్షులు సంతానోత్పత్తి కోసం అటవీశాఖ ఇనుప స్టాండ్లను ఏర్పాటు చేసింది.



కొల్లేరులో పక్షుల సందడి



ఆటపాక పక్షుల కేంద్రంలో బోటు షికారు

అభయారణ్య పరిరక్షణే లక్ష్యం



కొల్లేరు చిత్తడి నేలల ప్రాంతం. అనేక జీవరాశులకు ఇది నిలయం. కొల్లేరు అభయారణ్య పరిరక్షణకు అటవీశాఖ కట్టుబడి ఉంది. పక్షి ప్రేమికులకు స్వర్గధామంగా నిలుస్తున్న ఆటపాక పక్షుల కేంద్రంలో అన్ని వసతులు కల్పించాం. కొల్లేరు ప్రజల కోసం సర్కారు కాల్వపై వారధి నిర్మాణానికి శాఖపరమైన అనుమతులు ఇచ్చారు. త్వరలో వారధి ప్రారంభం కానుంది. కొల్లేరుల పక్షుల వేటను నిరోధించాం. రానున్న రోజుల్లో కొల్లేరు గొప్ప పర్యాటక ప్రాంతంగా విలసిల్లుతోంది. – **జె.శ్రీనివాసరావు, అటవీశాఖ రేంజర్, కైకలూరు**

స్కేటింగ్ క్రీడాకారులను అభినందించిన డిప్యూటీ సీఎం



క్రీడాకారులను అభినందిస్తున్న ఉపముఖ్యమంత్రి

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతిభావంతులైన క్రీడాకారులతో తాడేపల్లిగూడెంకు జాతీయస్థాయి గుర్తింపు ఖాయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని స్కేటింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదివారం క్రీడాకారులను మంత్రి కొట్టు సత్యనారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం స్కేటింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సబ్బిళ్ళ ఆశాదేవి, వైస్ ప్రెసిడెంట్ పులపర్తి ముత్యాలరావు, కార్యదర్శి పెద్దిరెడ్డి నరేష్, జాయింట్ సెక్రటరీ మానేపల్లి సతీష్, సత్త రామకృష్ణారెడ్డి, పచ్చిగోళ్ళ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య డాట్ కాం వెబ్‌సైట్ ఆవిష్కరణ



వెబ్‌సైట్ ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా

తణుకు: తణుకు పట్టణానికి చెందిన ప్రముఖ కవి రిషి రూపొందించిన సాహిత్య డాట్ కాం వెబ్‌సైట్‌ను మంత్రి ఆర్‌కే రోజా ఆదివారం ఆవిష్కరించారు. విజయవాడ పున్నమి ఘాట్ ఆడిటోరియంలో నిర్వహించిన బోయి భీమన్న జయంతి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రోజా వెబ్‌సైట్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రాచీన కవుల నుంచి నేటి ఆధునిక కవుల వరకు రచించిన రచనలు, కవితలు, నవలలు, ఆధ్యాత్మిక, సామాజిక గ్రంథాలు ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. కార్యక్రమంలో సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురువులే ప్రత్యక్ష దైవాలు

అపుస్మా ఉపాధ్యాయ దినోత్సవాల్లో మంత్రి కారుమూరి



తణుకులో ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న మంత్రి కారుమూరి, చిత్రంలో అపుస్మా నాయకులు

తణుకు అర్బన్: సమాజానికి ఉత్తమ పౌరులను అందిస్తున్న గురువులు ప్రత్యక్ష దైవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(అపుస్మా) ఆధ్వర్యంలో తణుకు క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును బంగారుబాటగా మలుస్తున్న ఉపాధ్యాయులందరూ అభినందనీయులన్నారు. విద్యావిధానం అభివృద్ధి పథంలో నడిస్తే రాష్ట్రం ప్రగతిపథంలో నడుస్తుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని ప్రాధాన్యత విద్యాశాఖకు ఇచ్చారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రూ.65 వేల కోట్లు విద్యాశాఖకు వెచ్చించి అమ్మ ఒడి ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో చదివే మధ్య తరగతి వర్గాలకు కూడా అండగా నిలబడ్డారని చెప్పారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తరువాత విద్యావిధానంలో తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పులతో గతంలో 15వ స్థానంలో ఉన్న రాష్ట్రాన్ని నేడు 3వ స్థానానికి తీసుకువచ్చారని అన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని, ప్రభుత్వం ద్వారా హెల్త్ కార్డులు అందించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. మంత్రి కారుమూరి ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులను అపుస్మా ఆధ్వర్యంలో మంత్రి కారుమూరి ఘనంగా సత్కరించగా, మంత్రి కారుమూరిని అపుస్మా నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వంక రాజకుమారి, కళాశాలల అసోసియేషన్ నాయకులు ప్రగతి రాజా, అపుస్మా స్టేట్ హానరరీ ప్రెసిడెంట్ బి.గోపాలకృష్ణ, అడిషినల్ జనరల్ సెక్రటరీ ఎంబీఎస్ శర్మ, రీజియన్ ప్రెశిడెంట్ జంగా బాలాజీ, స్టేట్ ఈసీ మెంబరు బి.విద్యాకాంత్, అపుస్మా జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీవీఎస్ పాపారావునాయుడు, తణుకు జోన్ అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పోడు పేరుతో చెట్ల నరికివేత

రెండు గ్రామాల గిరిజనుల మధ్య వివాదం



బుట్టాయగూడెం మండలం మర్లగూడెం తూర్పు వైపు అటవీప్రాంతంలో చెట్లు నరికివేసిన దృశ్యం

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలం మర్లగూడెం తూర్పువైపు అటవీప్రాంతంలో పోడు వ్యవసాయం పేరుతో వృక్షాలను యథేచ్ఛగా నరికివేశారు. జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ రేంజ్, మర్లగూడెం బీట్ పరిధిలో ఉన్న అటవీప్రాంతంలో మర్లగూడెం గ్రామానికి చెందిన గిరిజనులు 30 ఏళ్ల క్రితమే తాము ఆ ప్రాంతంలో మొక్కలు వేసుకున్నామని వీఎస్‌ఎస్‌లో ఉన్న తమకే ఆ భూములు చెందుతాయంటూ గత 4 రోజులుగా అటవీప్రాంతంలో మొక్కలు నరికి పోడు బాగుచేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఆ సమాచారం తెలుసుకున్న అటవీప్రాంతానికి దగ్గర గ్రామమైన కొమ్ముగూడెంకు చెందిన గిరిజనులు కొందరు అక్కడికి చేరుకుని ఆ అటవీ భూములు తమకే చెందుతాయని ఆ భూములు తమ గ్రామానికి దగ్గరగా ఉన్నందున తామే పోడు కొట్టి బాగుచేసుకుంటామంటూ వారు కూడా చెట్లను నరికి పోడు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఆ సమయంలో రెండు గ్రామాల గిరిజనులకు మధ్య వివాదం చెలరేగింది. అటవీ భూమి తమకే చెందుతుందంటూ ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అటవీ భూముల్లో చెట్లను నరుకుతున్నారనే సమాచారం అందుకున్న ఫారెస్ట్ అధికారులు అక్కడికి చేరుకుని చెట్లు నరికిన పరిసర ప్రాంతాలను పరిశీలించారు. జరిగిన సంఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు.

నరికిన వారిపై కఠిన చర్యలు

అటవీ హక్కుల చట్టం ప్రకారం మర్లగూడెం ఫారెస్ట్ పరిధిలో గతంలోని మర్లగూడెం గిరిజనులకు పోడు భూములకు పట్టాలిచ్చారు. 2006 తర్వాత అడవిని నరికి పోడు భూములుగా చేసుకుంటే వాటికి పట్టా ఇచ్చే అవకాశం లేదు. అయినప్పటికీ అనేక మంది అడవులను నరుకుతున్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నామని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం మర్లగూడెం అటవీప్రాంతంలోని తూర్పు వైపు అడవులను నరికివేసిన వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. 2006 డిసెంబర్ 13 తర్వాత అటవీభూములు నరికితే పట్టా రావనే విషయంపై గిరిజనులు అవగాహన పెంచుకోవాలని ఫారెస్ట్ అధికారులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా మొక్కలు నరికిన సంఘటనపై ఆదివారం ఎస్సై వెంకన్న మర్లగూడెం, కొమ్ముగూడెంకు చెందిన గిరిజనులను స్టేషన్‌కు పిలిపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫారెస్ట్ అధికారుల ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

భీమవరంలో యువకుడి హత్య

మృతుడు రౌడీషీటర్



హత్యకు గురైన విజయ్‌బాబు (ఫైల్)



సంఘటనా ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సాక్షి, భీమవరం: భీమవరంలో పట్టపగలు యువకుడి హత్య సంచలనం రేపింది. రౌడీషీటర్లకు సత్ప్రవర్తనపై కౌన్సెలింగ్ ఇచ్చి గంట గడవక ముందే ఈ హత్య జరిగింది. భీమవరం రెండో పట్టణం బలుసుమూడి గాంధీ రోడ్డుకి చెందిన బెవర విజయ్‌బాబు (23)ను గుర్తు తెలియని వ్యక్తులు కారుతో ఢీకొట్టి హత్య చేశారు. గతేడాది డిసెంబర్ 24న జరిగిన రౌతుల ఏసు హత్య కేసులో విజయ్‌బాబు నిందితుడు. రౌడీషీటర్లకు భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ద్విచక్రవాహనంపై వెళ్తున్న విజయ్‌బాబు, గోవిందరావును గొల్లవానితిప్ప రోడ్డులోని దుర్గాలక్ష్మి ఆలయ సమీపంలో కారుతో ఢీకొట్టగా బైక్ నడుపుతున్న విజయ్‌బాబు కిందపడిపోయాడు. సోదరుడు గోవిందరావు పక్కనే ఉన్న పంటకాలువలోకి దూకి అవతలి గట్టుకు చేరుకుని నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాడు.

హంతకుల్లో ఒకరి అరెస్టు

ఢీకొట్టిన అనంతరం కారు విజయ్‌బాబును కొద్ది దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. దుండగులు అతనిపై కత్తులతో దాడి చేసి తల, మెడపై విచక్షణారహితంగా నరకడంతో విజయ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కారులో నలుగురు, రెండు మోటార్‌సైకిళ్లపై వాహనాల్లో నిందితులు వెంబడించినట్లు తెలుస్తోంది. హత్య అనంతరం కారు పట్టణం వైపు వెళ్లినట్లు పోలీసులు సీసీ కెమెరాల్లో గుర్తించారు. హత్య ఘటన తెలిసిన వెంటనే ఎస్సై అప్పారావు, ఏఎస్సై బాజీ ఒక యువకుడ్ని వెంటాడి పట్టుకోగా ఆ యువకుడి చేతిలో హత్య సమయంలో ఉపయోగించిన కత్తి ఉన్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన యువకుడు భీమవరానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సంఘటనా స్థలాన్ని ఎస్పీ రవిప్రకాష్ పరిశీలించాడు. మృతుడిపై రౌడీషీట్ ఉందని, హత్యకు కారణాలు సేకరిస్తున్నామన్నారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టామన్నారు. రూరల్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పవన్ కల్యాణ్‌ను కూడా విచారించాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు



తణుకులో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు

తణుకు టౌన్: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన జరిగిన అవినీతిలో పవన్‌కు భాగముందని.. అప్పటి ప్రభుత్వం చేసిన అవినీతిలో పవన్ కల్యాణ్‌ను కూడా అరెస్ట్ చేసి విచారించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం తణుకు మాట్లాడుతూ.. 2014లో చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల పొత్తులో భాగంగానే టీడీపీ ప్రభుత్వం ఏర్పడిందని, అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడితో పాటు అతనితో పొత్తులో ఉన్న పవన్ కల్యాణ్‌కు కూడా దోపిడీలో భాగస్వామ్యం ఉంటుందన్నారు. పొత్తుతోనే 2024 ఎన్నికలకు వెళ్తున్నట్లు ప్రకటించడంతో జనసేన నాయకులు తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. పవన్ కల్యాణ్ అభిమానులు అతనిని ముఖ్యమంత్రిగా చూడాలని అనుకుంటే పవన్ మాత్రం చంద్రబాబునే ముఖ్యమంత్రిని చేయాలని ఆరాటపడుతున్నారన్నారు. పవన్ కల్యాణ్ నిర్ణయంతో జనసేన నాయకులతో పాటు టీడీపీ నాయకులు కూడా వచ్చే ఎన్నికల్లో తమకు సీట్లు ఇస్తారో లేదోనని ఆందోళనలో ఉన్నారని చెప్పారు.

దివ్యాంగుల క్రికెట్ జట్టుకు ఎంపిక



ఎం.కిశోర్‌బాబు



ఎండీ కాలిష్



యు.అఖిల్‌వర్మ

అత్తిలి: డిఫరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సనాతన సంస్థాన్ సంయుక్తంగా నిర్వహించే 3వ జాతీయ స్థాయి దివ్యాంగుల టీ–20 క్రికెట్ పోటీలకు పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు రాష్ట్ర క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 నుంచి అక్టోబరు 8 వరకు రాజస్థాన్‌లో ఈ టోర్నమెంట్ జరుగుతుందని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఎం.కిశోర్‌బాబు, ఎండీ కాలిష్, యు.అఖిల్‌వర్మలు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులు రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం అధ్యక్షుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి తనయుడు కారుమూరి సునీల్‌కుమార్ ఆకాంక్షించారు. జిల్లా క్రీడాకారులు రాణించాలని ఆంధ్ర దివ్యాంగుల క్రికెట్ సంఘం కార్యదర్శి యడ్లపల్లి సూర్యనారాయణ, జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం కార్యదర్శి దాసం వెంకట దుర్గారావు కోరారు.

బాల్య వివాహ నేరంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాల్య వివాహం నేరంపై జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ పీవో బ్యూలాకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని పంగిడిగూడెంలో బాల్య వివాహం జరుగుతున్నట్లుగా బ్యూలాకు సమాచారం వచ్చిందన్నారు. ఆమె ఐసీడీఎస్ సిబ్బందితో కలిసి పంగిడిగూడెం గ్రామంలో విచారణ నిర్వహించారు. ద్వారకాతిరుమల మండలం కోడిగూడెంకు చెందిన బాలిక (14 సంవత్సరాలు)కు జంగారెడ్డిగూడెం మండలం బిరుదుగడ్డ ప్రకాష్‌కు ఇచ్చి ఈ నెల 16న వివాహం జరిగినట్లు తేలిందన్నారు. యువకుడి తండ్రి బిరుదుగడ్డ పెంటయ్య, బాలిక తల్లి, సహకరించిన మరికొందరిపై బ్యూలా ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్



రాజుపేటలో సీజ్ చేసిన కోళ్ల వ్యర్థాల వాహనం వద్ద పోలీసులు

పెదపాడు: అక్రమంగా కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు తెలిపారు. పెదపాడు మండలంలోని రాజుపేట గ్రామం వైపుగా టొలోరో వాహనంలో కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో రాజుపేట టవర్ వద్ద వాహనాన్ని అడ్డుకుని 3 టన్నుల వ్యర్థాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న వాహనం యజమాని డ్రైవర్, హెల్పర్, చెరువు యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు.